చెక్కులు పంపిణీ చేసేదెన్నడో..?

- ప్రొటోకాల్ సమస్యతో ఇబ్బందిపడుతున్న అధికారులు

తరిగొప్పుల: మండలంలో లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి మోక్షం కలగడంలేదు. మూడు నెలల కిందనే చెక్కులు సిద్ధమైనా ప్రొటోకాల్ సమస్యతో పంపిణీ చేయడంలో తీవ్రజాప్యం జరుగుతోంది. దీంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడంలేదు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 23 చెక్కులు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్(పంపిణీకి) సిద్ధంగా ఉన్నాయి. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉండడం, స్థానిక ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీకి చెందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి కావడంతో చెక్కుల పంపిణీకి ప్రొటోకాల్ సమస్యతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 7వ తేదీన మండలకేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో చెక్కులు పంపిణీ చేస్తామని రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నట్టుండి చెక్కులు పంపిణీ వాయిదా పడిందని లబ్ధిదారులకు తెలియజేయడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. పార్లమెంట్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయిస్తామని, అప్పటి వరకు చెక్కుల పంపిణీ వాయిదా వేయాలని అధికార పార్టీ నాయకులు పట్టుబట్టడంతోనే చేసేది ఏం లేక పంపిణీని రెవెన్యూ అధికారులు వాయిదా వేసినట్లు సమాచారం.


తహసీల్దార్ కార్యాలయం

ఆర్థికంగా ఆసరా అవుతాయని ఎదురుచూస్తున్నాం

పంపిణీ చేస్తాం అంటున్నారు. కానీ చేయడంలేదు. ఆర్థికంగా ఆసరా అవుతాయని ఎదురుచూస్తున్నాం. చెక్కులు ఆఫీసులు రెడీగా ఉండి చేతికి అందకపోవడంతో అసహనంగా ఉంది. అధికారులు చొరవతీసుకుని చెక్కులు పంపిణీ చేయాలి.

- ఓ లబ్ధిదారు ఆవేదన

ఎంపీ చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు



ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేయడానికి తేదీని ఖరారు చేశాం. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎంపీ చేతుల మీదుగా పంపిణీ చేపిస్తాం అని చెప్పడంతో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగింది.

- మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్

సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

జనగామ రూరల్ : వానాకాలం సీఎంఆర్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ మిల్లర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు జిల్లాలో 2024–25 వానాకాలం సీఎంఆర్ లక్ష్యం 75.40 శాతం పూర్తయిందని, ఈ సీజన్‌లో 136867.080 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అయినట్లు పేర్కొన్నారు. ఇందులో కస్టమ్ మిల్లింగ్ రైస్ 91700.944 మెట్రిక్ టన్నులు కాగా 69248.894 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తయిందని చెప్పారు. జిల్లాలో బాయిల్డ్, రా రైస్ మిల్లర్లకు కేటాయించిన రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. మిల్లర్లు అలసత్వం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం బస్తాల అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో డీఎం సీఎస్ హతీరాం, డీసీఎస్ఓ సరస్వతి, డీఏఓ రామారావు నాయక్, ఏసీఎస్ఓ ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్, డీటీ సీఎస్‌లు శ్రీనివాస్, దేవా, మిలర్స్ అధ్యక్షుడు బెల్లి వెంకన్న, బజ్జూరి జయహరి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

మహిళలు మొక్కలు నాటాలి

జనగామ : మహిళందరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని మున్సిపల్ మేనేజర్ రాములు అన్నారు. గురువారం 'అమృత్ మిత్ర పథకం–ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యాన బతుకమ్మ కుంటలో చేపట్టిన 'విమెన్ ఫర్ ట్రీస్' సందర్భంగా మొక్కలు నాటిన అనంతరం మాట్లాడారు. ఈ పథకం ద్వారా రెండు సంవత్సరాలు మొక్కలను రక్షించే బాధ్యతను పల్లవి స్వయం సహాయక సంఘానికి అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ టీఎంసీ వాణిశ్రీ, ఆర్గనైజర్లు షాహిన్ సుల్తానా, తిరుమల, రేణుక పాల్గొన్నారు.


జనగామలో బతుకమ్మ కుంట వద్ద మహిళా సంఘ సభ్యులు

క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

జనగామ రూరల్: అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారావు మాట్లాడుతూ.. అకాల వర్షాలు మరో రెండు మూడు రోజులు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వానాకాలం సాగుకు అవసరమైన విత్తనాలు, యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఆలయంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ పూజలు


బండా ప్రకాశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

జనగామ: జిల్లా కేంద్రంలోని సంజయ్ నగర్ పెద్దమ్మ తల్లి ఆలయ 12వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ గురువారం హాజరై పూజలు చేసి మొక్కులను చెల్లించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహా సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లెబోయిన అశోక్, మత్స్యపారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు నీల రాజు, నాయకులు పిట్టల కుమార్, నీల యాదగిరి, అజయ్, మల్లేశం, ఉపేందర్, సురేష్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

లింగాలఘణపురం: మండలంలోని పటేల్‌గూడెం, నవాబుపేట పాఠశాలలను గురువారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ తనిఖీ చేశారు. పటేల్‌గూడెంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేయాలని ఇటీవల ప్రజావాణిలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టర్ పాఠశాలను తనిఖీ చేసి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేసే విధంగా అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా నవాబుపేట పాఠశాలలో విద్యార్థుల యూనిఫాంలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్‌యువ వికాసం పథకాల దరఖాస్తుల పరిశీలన చేశారు. ఆయన వెంట డీఆర్‌డీఓ వసంత, డీఈఓ భోజన్న, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంఈఓ విష్ణుమూర్తి ఉన్నారు.

'ఝాన్సీరెడ్డిని విమర్శించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు'

కొడకండ్ల: నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని పాలకుర్తికి వచ్చి నిత్యం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని విమర్శించే అర్హత బీఆర్ఎస్ నాయకులకు లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రతి ఎన్నికల్లో ఝాన్సీరాజేందర్‌రెడ్డి దంపతుల ఆర్థిక సహాయాన్ని పొందాడని, ఆ విషయాన్ని మర్చి బీఆర్ఎస్ నాయకులు నిస్వార్థ సేవాపరులైన ఝాన్సీరెడ్డిపై అర్థంలేని విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజేష్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలి


శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

చిల్పూరు: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి దాసరి గోవర్ధన్ అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వ శిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుల సామర్థ్యాల పెంపు అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానంపై ఎనిమిది మంది ఆర్‌పీఎంలు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బోధనాభ్యాసన సామర్థ్యాల పెంపు కోసం నిత్యం కృషిచేసి ప్రభుత్వ పాఠశాలలకు ఈ విద్యాసంవత్సరం వచ్చే విద్యార్థుల సంఖ్య పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్‌పీలు వేణుగోపాల్, రమాదేవి, అశోక్, వేణు, అనూజ, కల్యాణి, రాజన్‌బాబు, మూర్తి పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయసాధనకు కృషి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: వీరనారి చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఆర్ అండ్ బీ జంక్షన్ డెవలప్‌మెంట్ నిధుల ద్వారా చేపడుతున్న ఐలమ్మ విగ్రహానికి మెట్ల దిమ్మె నిర్మాణ పనులకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి.. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కోఠి ఉమెన్స్ కాలేజీకి ఐలమ్మ పేరు పెట్టిందని, ఐలమ్మ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఐలమ్మ కుటుంబ సభ్యులు చిట్యాల సంపత్, శ్వేత ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిని శాలువతో సన్మానించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, యాకాంతరావు, రాఘవరావు, ఎండీ నజీర్, పులి గణేష్, ఎండీ మదార్, కమ్మగాని నాగన్న, సోంమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డిలను సన్మానిస్తున్న ఐలమ్మ కుటుంబ సభ్యులు

ప్రమాదాలు

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

చిన్నారికి తీవ్రగాయాలు


పోషవ్వ (ఫైల్)

తరిగొప్పుల: ఇంటి ఎదుట ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వృద్ధురాలు మృతిచెందగా, చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొంక పోషవ్వ(70)తన ఇంటి ముందున్న పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా ఇంటికి ఎదురుగా ఉన్న మరొక ఇంటి స్లాబు ఇనుప చువ్వలకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో పోషవ్వ అక్కడికక్కడే మృతిచెందింది. కాగా, కింద పడిన పోషవ్వకు ఏమైందో తెలియక మునిమనువరాలు యోగిత(3) తాతమ్మను ముట్టుకుంది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు యోగితను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి..


అసాద్ మృతదేహం

బచ్చన్నపేట: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గోరమియా ఇంటికి రెండు రోజుల క్రితం జరిగిన కూతురు వివాహానికి బంధువులు వచ్చారు. పెళ్లి కూతురు మేనమామ జమాల్ ఇంటికి స్నానం చేసేందుకు బంధువులతోపాటు హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన దవాత్ అలీ–ఆలియా బేగం దంపతుల మూడో కుమారుడు ఎండీ అసాద్(15) కూడా వచ్చాడు. స్నానం చేయడానికి నీరు రాకపోవడంతో అసాద్ ఇంటిపై ఉన్న వాటర్ ట్యాంక్‌లో నీరు ఉన్నాయో చూసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఇంటిపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలు అసాద్‌కు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అసాద్ హైదరాబాద్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఘటనా స్థలానికి ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ చేరుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని పడమటితాళ్ల ఏరియాలో విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. దేవరుప్పులకు చెందిన ఈదునూరి లవకుశరెడ్డి తన పాడిగేదెను రోజువారీగా వ్యవసాయ బావి వద్దకు తీసుకెళ్లి మేతకు వదిలేశారు. ఈ క్రమంలోనే ఎస్ఎస్–7 ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే గల విద్యుత్ స్తంభానికి ఉన్న సపోర్టు వైరుకు కరెంట్ సరఫరా అయి పాడిగేదెకు తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనను గమనించిన పరిసరాల రైతులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసినప్పటికీ లాభం లేకుండా పోయింది. పాడి గేదె మృతితో రూ.లక్ష 10వేల నష్టం వాటిల్లినట్లయిందని రైతు తెలిపారు. సంఘటన స్థలాన్ని విద్యుత్ శాఖ అధికారులు సందర్శించి శాఖపరంగా బాధిత రైతుకు పరిహారం వచ్చేలా చూస్తామని భరోసా కల్పించారు.

పిడుగుపాటుతో ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బుధవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములుమెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగుపాటుతో స్థానిక పాత సినిమాథియేటర్ సమీపాన ఉన్న కుసుమ రమేశ్‌కు చెందిన ఇంట్లో పలు ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా బాధితుడు రమేశ్ మాట్లాడుతూ వివరాలు తెలిపారు. తమ జీ ప్లస్ టు ఇంటిపై నుంచి హైటెన్షన్ విద్యుత్ వైరు ఉందని, వైరును పక్కకు తొలగించాలని పలుమార్లు విన్నవించినా విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గత మూడేళ్లుగా వర్షాకాలంలో నష్టం వాటిల్లుతుందని, బుధవారం రాత్రి కురిసిన వర్షం, పిడుగుపాటుతో ఆరు ఫ్యాన్లు, ఆరు ట్యూబ్‌లైట్లు, ఒక గీజర్, ఒక టీవీతో పాటు మొత్తం వైరింగ్ కాలిపోయిందని, రూ.60వేలు నష్టం వాటిల్లిందని వాపోయారు. ఇంటిపై నుంచి హైటెన్షన్ వైరు ఉండటం కారణంగానే ప్రతి ఏడాది సమస్య ఏర్పడుతోందని, ఈ విషయమై ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


యాదగిరి (ఫైల్)

రఘునాథపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని వెల్ది గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నూనెముంతల యాదగిరిగౌడ్ (52)–భాగ్య దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఇద్దరు కుమారులు అఖిల్, అజయ్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. మృతుడు తన కున్న రెండు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ ఏడాది వ్యవసాయం కలిసి రాకపోవడంతో అప్పుల య్యాయి. అప్పుల విషయంలో భార్యా భర్తల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన యాదగిరి గురువారం మధ్యాహ్నం తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి వెంటనే జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.నరేష్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్ దుర్మరణం


నుజ్జునుజ్జు అయిన లారీ క్యాబిన్ వద్ద పోలీసులు

చిల్పూరు: ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన జనగామ జిల్లా వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిలోని వంగాలపల్లి–కరుణాపురం బస్‌స్టేజీల వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం క్వారీ నుంచి ఇసుక లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న లారీ వంగాలపల్లి–కరుణాపురం బస్‌స్టేజీల వద్దకు రాగానే రెండు టైర్లు పేలిపోయి లారీ రోడ్డుపైనే నిలిచిపోయింది. ఈ క్రమంలో దాని వెనకాలే వేగంగా వస్తున్న మరో లారీ ఢీ కొంది. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయింది. అందులోని నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం తేరటుపల్లికి చెందిన డ్రైవర్ అక్కినపల్లి వంశి(26) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దార్యప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

జనగామ : సంతోషిమాత ఆలయంలో..



జనగామ: సీతారామచంద్రస్వామి ఆలయంలో..



జనగామ: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



వైభవంగా హనుమాన్ జయంతి

జనగామ/సాక్షి నెట్‌వర్క్: అంజనీ పుత్రుడు, రామ బంటు ఆంజనేయస్వామి జయంతిని జిల్లా వ్యాప్తంగా ప్రజలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఓం శ్రీ రామ జయరామ, జయ జయ రామ అంటూ భక్తులు సంకీర్తనలతో స్వామి ఆరాధన చేశారు. ఆలయాల్లో విశేష నవకలశ, పంచామృత అభిషేకాలు, చందన పత్రపుష్ప అర్చనలు, ఆరాధనలు, హోమాలు, భజనలు చేశారు. భక్తుల హనుమాన్ నామ స్మరణలతో ఆలయాలు మారుమోగాయి. జిల్లాలోని లింగాలఘనపురం మండలం జీడికల్ శ్రీ సీతారామచంద్రస్వామి, స్టేషన్‌ఘన్ పూర్, చిల్పూరు, రఘునాథపల్లి, పాలకుర్తి, బచ్చన్నపేట, జఫర్‌గడ్ తదితర మండలాల్లోని ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా మాలధారులు హనుమాన్ భారీ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించగా, దాతలు భక్తులకు అన్నదానం నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వేలాది మంది మాలధారులు యాదగిరిగుట్ట, కొండగట్టు, విజయవాడ, భద్రాచలం తదితర ప్రాంతాలకు వెళ్లి మాలా విరమణ చేశారు.


స్టేషన్‌ఘన్‌పూర్: శోభాయాత్రలో భక్తులు


జనగామ: అలంకరణలో ఆంజనేయస్వామి


జఫర్‌గఢ్: శోభాయాత్రలో మాలధారులు


రఘునాథపల్లి: అశ్వరావుపల్లిలో..


పాలకుర్తి టౌన్: సోమేశ్వరాస్వామి ఆలయంలో..


చిల్పూరు: హోమం నిర్వహిస్తున్న అర్చకులు


దేవరుప్పుల: జలాభిషేకం చేస్తున్న భక్తులు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


ఇళ్లపై ఉన్న కరెంటు తీగలు

బచ్చన్నపేట: గోపాల్‌నగర్ గ్రామంలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 65కేఎం, 11కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏ ప్రమాదం చోటుచేసుకోక ముందే మార్చాలని పలు మార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు తెలిపారు. ఈ మేరకు గురువారం గ్రామస్తులు కలెక్టర్ రిజ్వాన్ బాషాకు వినతి పత్రాన్ని అందించారు.

వైద్య పరీక్షల పేర దోపిడీ

- భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమురయ్య

రఘునాథపల్లి: వైద్య పరీక్షల పేర కార్మికుల నుంచి రక్తం తీసుకొని దోపిడీ చేస్తున్నారని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య ఆరోపించారు. గురువారం మండలంలోని లక్ష్మీతండాలో భవన నిర్మాణ రంగాల కార్మికుల నూతన కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లేబర్ కార్డు ఉన్న వారు పరీక్షలు చేసుకోవాలని, లేకుంటే కార్డు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఒక కార్మికుడికి పరీక్షల పేర రూ.3,500 నుంచి రూ 4,000 తీసుకుంటున్నారని ఆరోపించారు. రక్తం తీసుకొని ఉచితంగా మందులు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. ఇప్పటి వరకు తెలంగాణ వెల్ఫేర్ బోర్డులో పరీక్షల పేర రూ.480 కోట్లు కుంభకోణం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో వెల్ఫేర్ బోర్డుకు కార్మిక శాఖ మంత్రిని నియమించలేదన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తూడి అంజయ్య, నాయకులు దరావత్ రవీందర్, బానోతు రివ, బానోతు మహేందర్, లింగం, అంజి, రవి, కిషన్, కాల్‌రాం, రవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొమురయ్య

24న ఆలయ భూముల కౌలుకు వేలం

పాలకుర్తి టౌన్: వల్మిడి సీతారామచంద్రస్వామి దేవస్థానం భూములను కౌలు కాస్తుకు వేలం ఈనెల 24వ తేదీ(శనివారం) పాలకుర్తి మండలం వల్మిడి దేవస్థానంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. మండలంలోని వల్మిడి, గూడూరు, ఈరవెన్ను, తొర్రూరు, రాయపర్తి మండలం కేశవాపురం, కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లి, పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామాల్లో వల్మిడి ఆలయ భూములకు బహిరంగ కౌలు కాస్తుకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సామెల్ మృతి తీరని లోటు

జఫర్‌గఢ్: కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త రడపాక సామెల్ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన సామెల్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కాగా, పార్టీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రడపాక డానియల్, బుల్లె పరుశరాములు, సదానందం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నిక

పాలకుర్తి: ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా వావిలాల హెచ్‌ఎం తండ మల్లయ్య ఎన్నికయ్యారు. పాలకుర్తిలో గురువారం ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా పాలకుర్తి టెంపుల్ కాలనీ పాఠశాల హెచ్‌ఎం ఇమ్మడి అశోక్, ఉపాధ్యక్షుడిగా గంప సరళ, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల గిరిధర్, కార్యదర్శిగా శైలజ, కోశాధికారిగా జ్యోతి శ్రీహరితో పాటు మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ నివేదికను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ కమిటీ కమిషన్ చెల్లించాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్, వెంకటేశ్వర్ రావు, అరుణ, స్వామి, వనజారాణి, రాములు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పాలకుర్తి: మండల కేంద్రంలో గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్‌ప్లేట్, లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు లేని వాహనాలు పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఎస్సైలు పవన్‌కుమార్, రాజేష్, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

దేవరుప్పుల: రోడ్డు నిబంధనలను విస్మరించి మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం గుండ్ల గూడెం గ్రామం కందిగడ్డ తండాకు చెందిన బానోత్ వంశీపై ఈ నెల 21వ తేదీన డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు కాగా గురువారం జనగామ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చామన్నారు. సదరు వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష , రూ.1,500 జరిమానా విధించినట్టు వివరించారు.